# సాక్షి బాపట్ల

ఆదివారం । 3 । డిసెంబర్ । 2023







## నిత్యాన్నదానానికి విరాళం

విజయవాడ : దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి విజయవాడ ఏలూరు రోడ్డుకు చెందిన కె.సుజాత, కొండిశెట్టి కార్తీ పేరిట రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు.



## ఎస్‌ఎఫ్‌ఐ మహాసభలు ప్రారంభం

జగ్గయ్యపేట అర్బన్: భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్‌ఎఫ్‌ఐ) ఎన్టీఆర్ జిల్లా మహాసభలు శనివారం ఆరంభమయ్యాయి. పేటలోని ఉక్కు కళావేదికపై జరిగిన సభలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పాల్గొన్నారు.



## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 523.30 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 2,550 క్యూసెక్కులు వదిలారు.



## న్యూస్‌రీల్

### అమరేశ్వరునికి లక్ష బిల్వార్చన



అమరావతి: అమరేశ్వరాలయంలో శనివారం దాతల సహకారంతో స్వామికి లక్ష బిల్వార్చనను ఆలయ అర్చకులు, వేద పండితులు భక్తిశ్రద్ధలతో జరిపించారు. తొలుత మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. ఆలయ వేద పండితులు గణపతి హోమం, సూర్యనమస్కారాలు నిర్వహించి స్వామికి విశేష అలంకరణ చేశారు. సహస్ర నామాలతో రుత్విక్కులు అమరేశ్వరునికి లక్ష బిల్వ దళార్చన నిర్వహించారు. బాలచాముండిక అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజలను చేశారు. ఆలయ ఈఓ వేమూరి గోపీనాథశర్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### తుఫాన్ నేపథ్యంలో విద్యుత్ శాఖ కంట్రోల్ రూం

నరసరావుపేట: తుఫాన్ కారణంగా గ్రామాల్లో విద్యుత్‌కు సంబంధించి ఎటువంటి సమస్యలు తలెత్తినా వెంటనే విద్యుత్‌శాఖ అధికారులకు తెలియజేయాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాసరావు కోరారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యుత్ తీగలపై చెట్లు పడటం, తీగలు తెగిపోవడం, విద్యుత్ స్తంభం పడిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజులు పోవడం జరిగితే వినియోగదారులు జాగ్రత్తలు వహించాలన్నారు. దీనికి సంబంధించి నరసరావుపేట డివిజన్ ఆఫీస్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సమస్యలు ఎదురైతే 94910 52195కు, టోల్ ఫ్రీ నంబరు 1912కు తెలియజేయాలని కోరారు.

### నెలరోజులపాటు అవగాహన కార్యక్రమాలు



గుంటూరు మెడికల్: రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరు ఒకటి నుంచి ప్రతిష్టాత్మకంగా ప్రతి ఒక్కరూ ఆరోగ్యశ్రీ పథకాన్ని వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలు నెలరోజుల పాటు నిర్వహిస్తుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు అన్నారు. ఆశా కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ఆరోగ్యశ్రీ అవగాహన కరపత్రాన్ని అందజేసి వారికి పథకం గురించి వివరించి, వారు ఉచిత వైద్య సేవలు పొందేలా చూడాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జిల్లాలోని 1,172 మంది ఆశాలకు, ఒక్కొక్కరికి రెండు చొప్పున యూనిఫామ్ చీరలు డాక్టర్ శ్రావణ్‌బాబు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికి తెలియజేయాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష బ్రోచర్లను కూడా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీహెచ్‌ఎన్‌ఓ శాంతకుమారి, హెచ్‌ఈఈఓ కె.పి.చంద్రశేఖర్, డీసీపీఎం సురేష్ పాల్గొన్నారు.

### గుంటూరు-రేపల్లె మార్గంలో రైళ్లు రద్దు

తెనాలిరూరల్: తుపాను నేపథ్యంలో గుంటూరు-రేపల్లె మార్గంలో రైళ్లన్నింటినీ రద్దు చేసినట్టు తెనాలి స్టేషన్ మేనేజర్ టీవీ రమణ శనివారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మార్గంలో ఈనెల 5వ తేదీ వరకు అన్ని రైళ్లను అధికారులు రద్దు చేశారన్నారు. విజయవాడ-చెన్నై మార్గంలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లనూ రద్దు చేశారని చెప్పారు. ప్రయాణికులు గమనించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

# తెలివిగా శ్రమిస్తే విజయం తథ్యం

- సివిల్స్ విజేత బాలలత వెల్లడి
- 'సాక్షి' గ్రూప్-1,2 సెమినార్ గ్రాండ్ సక్సెస్
- గుంటూరులోని ఏసీ కళాశాలలో జరిగిన అవగాహన సదస్సుకు విశేష స్పందన
- పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన అభ్యర్థులు
- సివిల్స్, గ్రూప్-1,2 పరీక్షల సన్నద్ధత, ప్రణాళికపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించిన బాలలత
- 'సాక్షి' సదస్సు ప్రయోజనం చేకూర్చిందన్న అభ్యర్థులు



సెమినార్‌లో మాట్లాడుతున్న సివిల్స్ టాపర్ బాలలత



సదస్సుకు హాజరైన పోటీ పరీక్షల అభ్యర్థులు, విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్/ నగరంపాలెం(గుంటూరు వెస్ట్): తెలివిగా శ్రమిస్తే సివిల్స్, గ్రూప్-1, 2 వంటి పోటీ పరీక్షల్లో విజయం తథ్యమని సివిల్స్ విజేత బాలలత పేర్కొన్నారు. గుంటూరులోని ఆంధ్ర క్రైస్తవ (ఏసీ) కళాశాలలో శనివారం ''సాక్షి'' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో గ్రూప్-1, 2 పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతోపాటు బీటెక్, డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ నుంచి ముఖ్య వక్తగా పాల్గొన్న బాలలత మాట్లాడుతూ ఏపీపీఎస్సీ త్వరలో గ్రూప్-1, గ్రూప్-2 నోటిఫికేషన్లు విడుదల చేయనున్న దృష్ట్యా, ఆయా పోటీ పరీక్షల్లో విజయసాధనే లక్ష్యంగా ఉన్న అభ్యర్థులు ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాలని సూచించారు. గతంలో జరిగిన గ్రూప్-1, 2 పరీక్షల ప్రశ్నపత్రాలను అధ్యయనం చేస్తే ప్రశ్నలస్థాయి, సరళిపై అవగాహన సిద్ధిస్తుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. రాష్ట్ర భౌగోళిక స్వరూపం, నిధులు, తీరప్రాంతం, జిల్లాల పునర్విభజనతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి సూచీలో స్థానం, రాష్ట్ర బడ్జెట్‌పై సమగ్ర అవగాహన అవసరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ద్వారా క్రీడల్లో ప్రోత్సాహం, పోటీతత్వం పెంచేందుకు తీసుకుంటున్న చర్యలను అధ్యయం చేయాలన్నారు. ఏపీలో స్కిల్ డెవలప్‌మెంట్, కరెంట్ అఫైర్స్, గాలేరు-నగరి సుజల స్రవంతి, అవుకు రెండో టన్నెల్ ప్రారంభోత్సవం, తుఫాన్‌లకు వేర్వేరు పేర్లు పెట్టడం వెనుక ఉద్దేశం ఏమిటనే అంశాలు తప్పనిసరిగా తెలుసుకోవాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, ప్రముఖుల పేర్లు, నాగార్జున సాగర్ ప్రాజెక్టు సమగ్ర సమాచారంతోపాటు స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో గుంటూరు జిల్లాకు 3వ స్థానం రావడం వంటి అనేక అంశాలపై పట్టు ఉండాలని సూచించారు. రాష్ట్రంలో పెట్టుబడులు, సంక్షేమ కార్యక్రమాలతో సహా అన్ని అంశాలపై నోట్సు తయారు చేసుకోవాలని చెప్పారు. ప్రపంచ బ్యాంకు నిధులతో చేపట్టిన సాల్ట్ ప్రోగ్రాం, జగనన్న ఆరోగ్య సురక్ష, అమ్మఒడి, విద్యాదీవెన, రైతు భరోసా, వైఎస్సార్ లా నేస్తం, విద్యాకానుక కిట్లు, గోరుముద్ద వంటి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై కచ్చితంగా ప్రశ్నలు ఉంటాయని వివరించారు.

### రాత్రీపగలూ చదవనవసరం లేదు

పోటీ పరీక్షలకు సన్నద్ధం పేరుతో రాత్రీపగలూ చదవడం వలన ప్రయోజనం ఉండదని, హార్డ్ వర్క్ కంటే తెలివిగా శ్రమించడం వల్లే విజయం సాధించగలమని బాలలత చెప్పారు. విషయపరిజ్ఞానం, ప్రశ్నల సరళిని అర్థం చేసుకునే నైపుణ్యంగలవారే గెలుపు అందుకుంటారని వివరించారు. చదువుకుటూ రాయడం అత్యంత కీలకమని, సివిల్స్‌లో టాప్ ర్యాంకర్లుగా నిలిచిన వాళ్లు చేసిన పని ఇదేనని చెప్పారు. చదివిన ప్రతి అంశాన్నీ నోట్సులో రాసుకుని, తిరిగి మళ్లీ చదవడం ద్వారా ప్రతి విషయాన్ని గుర్తుంచుకుంటామని చెప్పారు. ప్రణాళికాబద్ధంగా రోజుకు రెండు చొప్పున ఒక ఇష్టమైన ఒక కష్టమైన సబ్జెక్టును చదవాలని సూచించారు. సదస్సులో సాక్షి బ్రాంచ్ మేనేజర్ టి.గోపి, యాడ్స్ మేనేజర్ ఎంవీడీ సత్యనారాయణ పాల్గొన్నారు.

### పోటీతత్వంతో ముందుకు వెళ్లాలి



ముందు పోటీతత్వం అలవడాలి. ప్రిపరేషన్ ప్రణాళికాబద్ధంగా ఉండాలి. నోట్సు సిద్ధం చేసుకోవాలి. తెల్లవారుజామునే లేచి చదవాలి. ఓపిక ఉండాలి. ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో చదివిన తాను యూపీఎస్సీ మెయిన్స్ రాశాను. గ్రూప్-1 ఆఫీసర్‌గా విజయం సాధించాను. రోజుకు 8 నుంచి 10 గంటలపాటు ప్రణాళికతో చదివితే ఉద్యోగం ఖాయం.

– కె.రఘు,
జిల్లా ఉపాధి కల్పనాధికారి, గుంటూరు

### ప్రతి విషయంపై ఆసక్తి అవసరం



పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ప్రతి విషయాన్నీ తెలుసుకోవాలనే ఆసక్తి ఉండాలి. ఎలాగైనా గెలవాలనే స్ఫూర్తిని ముందు మనకు మనం పొందాలి. సివిల్స్, గ్రూప్-1 పరీక్షల్లో విజయం సాధించిన వారితోపాటు ఫెయిలైన వారితో మాట్లాడి కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేయాలి. జాగ్రఫీ, పాలిటీ, ఎకానమీలతోపాటు కరెంట్ అఫైర్స్‌పై అప్‌డేట్ అవుతుండాలి. – ప్రవీణ్, ఫ్యాకల్టీ

### సమయపాలన ఎంతో అవసరం



ప్రణాళికాబద్ధమైన కృషి, సమయపాలన అభ్యర్థులకు ఎంతో అవసరం. పోటీ పరీక్షల సమాచారంతోపాటు ఉద్యోగ నియామక పరీక్షలు, విద్యార్థులకు అత్యంత విలువైన సమాచారాన్ని అందించడంలో సాక్షి విశేషంగా కృషి చేస్తోంది. గతంలో సాక్షి అందిస్తున్న భవితలో ఐఐటీ-జేఈఈ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా గణితంలో రైటర్‌గా ఆర్టికల్స్ రాశాను. సోషల్ మీడియా ప్రభావంతో విద్యార్థుల్లో రైటింగ్, రీడింగ్ స్కిల్స్ తగ్గిపోతున్నాయి. అభ్యర్థులు తమ శ్రమను నమ్ముకుని పోటీ పరీక్షల్లో విజయాన్ని సాధించాలి.

– డాక్టర్ కె.మోజెస్, ఏసీ కళాశాల ప్రిన్సిపాల్

### చక్కటి బోధన..



అగ్రికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్ పరీక్షకు ప్రిపేరవుతున్నా.. సాక్షి ఎడ్యుకేషనల్ వెబ్‌సైట్ చాలా ఉపయోగకరంగా ఉంది. ప్రస్తుతం పోటీ పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలనేది సదస్సులో చక్కగా వివరించారు. ఎలా చదవాలనేది బాగా చెప్పారు. ఉద్యోగం సాధిస్తాననే నమ్మకం ఏర్పడింది.

– కె.లీలావాణి, గుంటూరు

### అవగాహన సదస్సులతో మేలు



గ్రూప్-2 ఉద్యోగానికి సిద్ధమవుతున్నా. ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నా. అయితే సాక్షి దినపత్రిక ఏపీ అంతటా నిర్వహిస్తున్న ఇటువంటి అవగాహన సదస్సులు నాలాంటి అభ్యర్థులకు ఉపయోగకరంగా ఉంటాయి. ఈ సదస్సు నాకు ఎంతో ప్రయోజనకరంగా ఉంది.

– సాదం మల్లికార్జునరావు, ఒంగోలు, ప్రకాశం జిల్లా

### విజయంపై నమ్మకం వచ్చింది




ఏపీపీఎస్సీకి ప్రిపేరవుతున్నా.. గతంలో విజయవాడలో జరిగిన సదస్సుకు హాజరయ్యా. ఇప్పుడు గుంటూరు జిల్లాలో జరిగిన సదస్సుకు హాజరయ్యా. ఈ రెండు అవగాహన సదస్సుల్లో వక్తలు చెప్పిన అంశాలు బాగున్నాయి. దీనివల్ల నాకు నమ్మకం ఏర్పడింది.

– గీతాంజలి, వడాలి గ్రామం, ముదినేపల్లి, విజయవాడ

# 'అల'జడి

- బంగాళాఖాతంలో తుఫాన్
- సముద్రంలోకి వేటకు వెళ్లరాదు
- కార్తిక సందర్శకులకూ నో ఎంట్రీ
- నిజాంపట్నం హార్బర్‌లో 1వ నంబర్ ప్రమాద సూచిక
- కలెక్టర్ రంజిత్‌బాషా

**87126 55881**
కంట్రోల్ రూం నంబర్



వాడరేవులో ఉధృతంగా సముద్రం

బాపట్ల అర్బన్: బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ వల్ల రాబోయే మూడు రోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలతోపాటు ఈదురుగాలులు వీచే ఆస్కారం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో సముద్ర పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా శనివారం తెలిపారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ (ఫోన్ నంబర్- 8712655881) ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఏదైనా విపత్కర పరిస్థితి తలెత్తితే ప్రజలు కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని పేర్కొన్నారు. సముద్ర తీర ప్రాంత అధికారులు, మండల ప్రత్యేక అధికారులు స్థానికంగానే విధుల్లో ఉండాలని ఆదేశించారు. చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు వెంటనే ఒడ్డుకు చేరుకోవాలని పేర్కొన్నారు. కొత్తగా ఎవరూ వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. కోత దశలో ఉన్న పంటలను సంరక్షించుకోవాలని రైతులకు సూచించారు. రెవెన్యూ సెక్రటేరియట్, విద్యుత్ శాఖల అధికారులు హెడ్‌క్వార్టర్లలో ఉండాల్సిందిగా సూచించారు. అనంతరం అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్సు నిర్వహించారు.

**ఒడ్డుకు చేరిన బోట్లు**

నిజాంపట్నం: తుఫాన్ ప్రభావంతో బోట్లన్నీ హార్బర్ ఒడ్డుకు చేరాయి. అధికారుల ఆదేశాలతో సముద్రంలో వేటకు సిద్ధమైన మత్స్యకారులు తిరిగి పల్లెలకు చేరుకున్నారు. హార్బర్‌లో ప్రస్తుతం 1వ నంబర్ ప్రమాద సూచికను అధికారులు ఎగరవేశారు. దీంతో మత్స్యకారులు తమ బోట్లను, వేటసామగ్రిని భద్రపరుచుకునే పనిలో నిమగ్నమయ్యారు.

**వాడరేవులో..**

చీరాల టౌన్: తుఫాన్ తీరం దాటేంతరకు వాడరేవు, తదితర సముద్రతీర ప్రాంత మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు సూచించారు. శనివారం తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది వాడరేవు తీరప్రాంతంలో పర్యటించారు. తహసీల్దార్ మాట్లాడుతూ సముద్రతీరంలోకి కార్తిక సందర్శకులకూ అనుమతి లేదని స్పష్టం చేశారు. విపత్కర పరిస్థితులు తలెత్తితే సహాయ చర్యలకు అన్ని ఏర్పాట్లూ చేశామని, ఆహారపదార్థాలు, పునరావాస కేంద్రాలు సిద్ధం చేశామని వెల్లడించారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. తహసీల్దార్ వెంట మెరైన్ ఎస్సై పసుపులేటి సుబ్బారావు, ఆర్ఐ శేఖర్, ఎఫ్‌డీవో రాజ్‌కుమార్, పంచాయితీ సెక్రటరీ రామసుబ్బారెడ్డి ఉన్నారు.

**22 వరకు సముద్రంలో వేట నిలుపుదల..**

ఈనెల 3 నుంచి 22 వరకు సముద్రంలో క్షిపణి ప్రయోగాలు చేస్తున్నందున భారత వాయుసేన సూర్యలంక, కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశాల మేరకు మత్స్యకారులు వేట చేయవద్దని ఆదేశాలిచ్చారని చీరాల ఎఫ్‌డీవో రాజ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం వాడరేవు, రామాపురం, తదితర తీరప్రాంత గ్రామాల్లోని మత్స్యకార సొసైటీ నాయకులు, బోటు యాజమానులు, సంప్రదాయ మత్స్యకారులకు నోటీసులు అందించారు. కలెక్టర్ ఆదేశాలను పాటించి క్షిపణి ప్రయోగాలు చేసే సమయంలో వేట నిలుపుదల చేయాలని, ఆదేశాలను విస్మరించి సముద్రంలో వేట సాగించే వారిపై చర్యలు తప్పవని పేర్కొన్నారు. అధికారుల హెచ్చరికలతో మత్స్యకారులు తమ బోట్లను ఒడ్డుకు చేర్చుకున్నారు.



నిజాంపట్నం హార్బర్‌లో బోట్లను ఒడ్డుకు చేరుస్తున్న మత్స్యకారులు



వాడరేవు తీరాన్ని పరిశీలిస్తూ సూచనలందిస్తున్న తహశీల్దార్ ప్రభాకరరావు, మెరైన్ పోలీసులు

## క్లుప్తంగా

### బీఎల్‌ఓలు అప్రమత్తంగా ఉండాలి

స్పెషల్ కలెక్టర్ పి.ఉమాదేవి



**మేదరమెట్ల:** ఓటర్ల జాబితా తయారీలో బీఎల్ఓలు అప్రమత్తంగా ఉండాలని స్పెషల్ కలెక్టర్ పి.ఉమాదేవి పేర్కొన్నారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామంలో 275, 276, 277 నెంబర్లు గల పోలింగ్ బూత్‌లను స్పెషల్ కలెక్టర్ శనివారం పరిశీలించారు. పరిశీలనలో భాగంగా కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియతో పాటు మరణించిన వారి ఓట్లను తొలగించడం చేయాలని బీఎల్‌ఓలకు సూచించారు. ఓటరు జాబితాలో ఎలాంటి అవకతవకలు ఉన్నా వాటిని వెంటనే సరిచేయించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుశీల, డీటీ మెహతాజ్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

### ట్రాక్టర్ బోల్తా.. యువకుడు మృతి



**జె.పంగులూరు:** డ్రైవర్ మద్యం తాగి ట్రాక్టర్ నడపడంతో బోల్తా పడిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని రేణింగవరం గ్రామంలో శనివారం జరిగింది. అందిన సమాచారం మేరకు.. మండలంలోని అలవలపాడు గ్రామానికి చెందిన ముచ్చు వెంకటేశ్వర్లు కుమారుడు ముచ్చు సాయి (20) గ్రామ సమీపంలో ఉన్న పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి డ్యూటీ చేసిన సాయి శనివారం ఉదయం అలవలపాడు వెళ్లేందుకు సుబాబుల్ పాట్టు కోసం వెళ్తున్న ట్రాక్టర్ ఎక్కాడు. ట్రాక్టర్ డ్రైవర్ మద్యం తాగి ఉండటంతో ట్రాక్టర్ అదుపులో లేకుండా నడుపుతున్నాడు. ట్రాక్టర్ ఫ్లైఓవర్ దాటి సర్వీస్ రోడ్లోకి వెళ్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది. ఇది గమనించిన సాయి ముందుగానే ట్రాక్టర్ నుంచి కిందకి దూకాడు. కింద పడిన సాయి మీదుగా ట్రాక్టర్ ట్రాలీ వెళ్లడంతో సాయికి కనపడని గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కొరిశపాడు 108 సిబ్బంది క్షతగాత్రుడిని అద్దంకి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా, డాక్టర్ల సూచన మేరకు ఒంగోలు వెంకటరమణ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయి మరణించాడు. మృతుడికి వివాహం కాలేదు. రేణింగవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 'వికసిత్ యాత్ర' ప్రయోజనం చేకూర్చాలి

యాత్ర రాష్ట్ర నోడల్ అధికారి రాహుల్ మాలిక్



మాట్లాడుతున్న నోడల్ అధికారి రాహుల్, పక్కన కలెక్టర్ రంజిత్‌బాషా, జేసీ శ్రీధర్

**బాపట్ల అర్బన్:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు మారుమూల ప్రాంతంలోని గిరిజనులకు చేరవేయాలని రాష్ట్ర నోడల్ అధికారి రాహుల్ మాలిక్ అన్నారు. వికసిత్ భారత సంకల్ప యాత్ర కార్యక్రమం అమలు తీరుపై శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, ఎంపీడీఓలతో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాలో యాత్ర కొనసాగుతున్న తీరుపై జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా సంయుక్త కలెక్టర్ సీహెచ్ శ్రీధర్‌లు పీపీటీ ద్వారా ఆయనకు వివరించారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరాలని వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా నోడల్ అధికారి రాహుల్ మాలిక్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన ప్రతి పేదవాడికి చేర్చడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. గిరిజన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నిరుపేదల జీవనోపాధి గత పరిస్థితుల కంటే మెరుగుపడాలన్నారు. సంకల్ప యాత్ర ద్వారా రానున్న మూడు నెలల్లో లబ్ధిదారుల సంఖ్య 20 శాతానికి పెరగడమే లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత లబ్ధి చేకూరే పథకాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాహుల్ మాలిక్ చెప్పారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజలకు చేరవేయాలన్నారు. ప్రతి పథకంలో లక్ష్యాలు, పురోగతిని ప్రజలకు వివరించాలన్నారు. రానున్న మూడు నెలలలో ఏ మేరకు లబ్ధిదారుల సంఖ్య పెరిగిందో సమగ్ర నివేదికను సిద్ధం చేయాలన్నారు. వికసిత్ భారత సంకల్ప యాత్ర కార్యక్రమాలను జిల్లాలో 48 గ్రామపంచాయతీలలో నిర్వహించామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. 459 పంచాయతీలలో నాలుగు ప్రచార వాహనాలతో ప్రచార కార్యక్రమాలు నిర్వహించడానికి సమగ్ర ప్రణాళిక రూపొందించామన్నారు. అన్ని గ్రామాలలో సజావుగా కార్యక్రమాలు సాగుతున్నాయన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, బాపట్ల ఆర్డీఓ జి.రవీందర్, జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు, అనుబంధ శాఖల అధికారులు, ఎంపీడీఓలు, తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం నుంచి ఆరోగ్యశ్రీ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. జీజీహెచ్‌లో జరిగిన కార్యక్రమంలో కార్యక్రమం పోస్టర్లను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్, డీఎంఈ డాక్టర్ నరసింహం, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ చీకటి విజయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# చైన్‌స్నాచింగ్ ముఠా అరెస్ట్

- పోలీసుల అదుపులో నలుగురు నిందితులు
- 106.56 గ్రాముల బంగారం స్వాధీనం



వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

**రేపల్లె:** ఒంటరిగా ఉన్న మహిళలను బెదిరింపులకు గురిచేసి బంగారు నగలను అపహరించిన సంఘటనలలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ తెలిపారు. స్థానిక రేపల్లె రూరల్ సర్కిల్ కార్యాలయంలో శనివారం ఆయన బంగారు నగల చోరీకి పాల్పడిన వారి వివరాలను వెల్లడించారు. నియోజకవర్గంలో వివిధ ప్రాంతాలలో దొంగతనాలకు పాల్పడిన చెరుకుపల్లికి మండలానికి చెందిన యుగంధర్‌రెడ్డి (కుంచాలవారిపాలెం), నగరాజకుమారి(లక్ష్మీనివాస్‌కాలనీ), శివనాగిరెడ్డి (తుమ్మలపాలెం), మణికంఠ (యల్లారెడ్డిపాలెం)లను అదుపులోకి తీసుకున్నామన్నారు. యుగంధర్ రెడ్డి తల్లిదండ్రులు చనిపోయి ఒంటరిగా జీవిస్తూ ఉంటాడని, వీర నగరాజకుమారి భర్తతో విడిపోయి విడిగా తన పిల్లలను చదివిస్తూ వంట పనులు చేసుకుంటు ఉంటుందన్నారు. యుగంధర్‌రెడ్డి తన ఆటోలో నగరాజకుమారిని వెంటపట్టుకుని వంట పనులకు వెళుతుండేవాడన్నారు. యుగంధర్ రెడ్డి స్నేహితులు శివ నాగిరెడ్డి, మణికంఠ రెడ్డిలు దురలవాట్లకు బానిసలైనారని చెప్పారు. నిందితులు నలుగురు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో అందరూ కలిసి ఒక ముఠాగా ఏర్పడి ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకొని వారి మెడలలో ఉన్న బంగారు ఆభరణాలను బలవంతంగా లాక్కొని, వాటిని అమ్ముకొని వచ్చిన డబ్బులను జల్సాలకు వాడుకునేవారన్నారు. ఈ విధంగా అడవులదీవిలో 3 కేసులు, చెరుకుపల్లి 2, నిజాంపట్నంలో ఒక కేసు, భట్టిప్రోలు పోలీసు స్టేషన్‌లో ఒక కేసు మొత్తం 7 కేసులు నమోదయ్యాయని చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేశామని చెప్పారు. రేపల్లె రూరల్ సీఐ శివశంకర్ ఆధ్వర్యంలో సిబ్బంది సహాయంతో నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 107.056 గ్రాములు బంగారు ఆభరణాలు, ఒక జత వెండి కాళ్ల పట్టీలు, ఆటో, ద్విచక్రవాహనంను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు హాజరుపర్చుతున్నట్లు చెప్పారు. సమావేశంలో రూరల్ సీఐ శివశంకర్, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

### అటవీ భూముల్లో గ్రావెల్ తీస్తే చర్యలు

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్

**బల్లికురవ:** అటవీ శాఖకు సంబంధించిన భూములు ఆక్రమించినా, గ్రావెల్ తవ్వకాలు చేసినా, బోర్లు వేసినా, జంతువులను వేటాడినా కఠిన చర్యలు తీసుకుంటామని కూకట్లపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె. రమేష్ హెచ్చరించారు. శనివారం బల్లికురవ, మార్టూరు మండలాల్లోని అటవీశాఖకు సంబంధించిన భూములను ఆయన పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. మండలంలోని గొర్రెపాడు, కూకట్లపల్లి, ఉప్పమాగులూరు, ముక్తేశ్వరం, మార్టూరు మండలంలోని నాగరాజుపల్లిలో సుమారు 1600 హెక్టార్ల ఫారెస్టులు ఉన్నాయని చెప్పారు. ఈభూములకు సంబంధించిన గుర్తింపు బోర్డులను కూడా ఏర్పాటు చేశామని రమేష్ వివరించారు. జగనన్న భూహక్కు-భూసర్వేలో రెవెన్యూ రికార్డులో కూడా తమ ఫారెస్టు భూములను విభజించాలని వివరించారు.

### వీఆర్‌కు ఏఎస్‌ఐ సైదా

**మార్టూరు:** విధి నిర్వహణలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏఎస్‌ఐ వీఆర్‌కు బదిలీ అయ్యారు. మార్టూరు పీఎస్‌లో సైదా ఏఎస్ఐ సైదాగా పని చేస్తున్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ నాలుగు రోజుల క్రితం వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఎస్ఐ ట్రైనింగ్‌లో ఉన్న సైదా శనివారం స్టేషన్‌కు వచ్చి వీఆర్‌కు వెళ్లనున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. విధి నిర్వహణలో పలు సందర్భాల్లో సైదా ఆరోపణలు ఎదుర్కొన్నారు. బల్లికురవ మండలం వల్లాపల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని వలపర్ల సినిమా హాలు సెంటర్‌లో స్థానికులు దాడి చేసిన కేసులో రూ.50 వేలు చేతులు మారిన విషయంలో సైదాది ప్రధాన పాత్రగా ఆరోపణలున్నాయి. మార్టూరు బొడ్డురాయి సెంటర్‌లో ఇటీవల ఇరువర్గాల మధ్యన జరిగిన దాడిలోను భారీ మొత్తాన్ని డిమాండ్ చేసినట్లు కూడా సమాచారం. చిలకలూరిపేట మండల పోతవరం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మార్టూరు సమీపంలో 2 నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుని బంధువుల నుంచి సైదా రూ.4 వేలు స్థానికుల ద్వారా వసూలు చేశాడని విశ్వసనీయ వర్గాల సమాచారం.





# ప్రత్యామ్నాయ పంటలుగా అపరాలు

ఏరువాక శాస్త్రవేత్త ఓబయ్య



మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఓబయ్య

**అద్దంకి:** సాగర్ నీరు లేనందున వరి పంటకు ప్రత్యామ్నాయంగా అపరాల పంటలను సాగు చేసుకోవాలని బాపట్ల ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎంపీ ఓబయ్య సూచించారు. మండలంలోని ధర్మవరం, కలవకూరు, శంఖవరప్పాడు రైతు భరోసా కేంద్రాల్లో శనివారం రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఓబయ్య మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అపరాల సాగు చేసి లాభాలు పొందవచ్చన్నారు. విత్తన శుద్ధి చేసుకోవడం తప్పనిసరని చెప్పారు. డిప్యూటీ డైరెక్టర్ విజయనిర్మల మాట్లాడుతూ రానున్న మూడు రోజుల్లో తుఫాన్ కారణంగా అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. లోతట్టు పొలాల రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏడీ కొర్రపాటి వెంకట కృష్ణ మాట్లాడుతూ యాప్ ఓపెన్ అయిందని, రబీ సీజన్‌లో ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

### రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీఓ వివాహం

**రేపల్లె రూరల్:** రేపల్లె రెవెన్యూ డివిజన్ అధికారి వివాహం తన కార్యాలయంలో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే రేపల్లె ఆర్డీఓ హెలా షారోన్, అల్లూరి సీతారామరాజు జిల్లా చింతురు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా విధులు నిర్వహిస్తున్న చైతన్యలు రేపల్లె రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో రిజిస్టర్ వివాహం చేసుకున్నారు. రేపల్లె సబ్ రిజిస్ట్రార్ విజయప్రసాద్ సమక్షంలో ఇరువురి కుటుంబ సభ్యుల సమక్షంలో రిజిస్టర్ వివాహం చేసుకున్నారు.



కార్యాలయంలో రిజిస్టర్ మ్యారేజ్ చేసుకుంటున్న ఆర్డీఓ హెలా షారోన్, ఐటీడీఏ పీఓ చైతన్య